క్లుప్తంగా

కంటైనర్ బోల్తా



బంగారుపాళెం: కొత్తపల్లె సమీపంలో బోల్తా పడిన కంటైనర్ వాహనం

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లె వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ పార్సిల్ సర్వీసుకు చెందిన కంటైనర్ బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విజయవాడ నుంచి బెంగళూరుకు పోతున్న వీఎల్ఆర్ పార్సిల్ సర్వీసు కంటైనర్ కొత్తపల్లె ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన లారీ డ్రైవర్ మంజునాథ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



బంగారుపాళెం: రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆసీఫ్

బంగారుపాళెం: రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆసీఫ్ సూచించారు. సోమవారం మండలం ఊటువంక గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో 120 పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు వేశారు. పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులు పాడిపశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అటువంటి పశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. పాడిపోషణ, ఆరోగ్యంపై రైతులకు పలుసూచనలు, సలహాలు అందించారు. పాడిరైతులు 6 నెలలకు పైబడిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వినియోగంలోకి రానున్న మరుగుదొడ్లు



సిద్ధమైన మరుగుదొడ్లు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జంబువారిపల్లె సర్పంచ్ అమర, ఉపసర్పంచ్ కమలనాథరెడ్డి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో టాయిలెట్ల సదుపాయం లేక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు.

సమస్యలు పరిష్కరించండి



సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఇందులో ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, మెప్మా, ప్రజారోగ్యం విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళా అదృశ్యం

చిత్తూరు అర్బన్: మహిళా అదృశ్యంపై చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. చిత్తూరు నగరం గిరింపేటకు చెందిన ఓ మహిళ (45) గత నెల 30వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం గాలించారు. తిరిగి రాకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో మంగళవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక 22వ డివిజన్ తేనెబండలోని వీరభద్రస్వామి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానికులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

వారం వారం విన్నవిస్తున్నా..

- అయినా అధికారులు పరిష్కార మార్గాలు చూపరా ?
- ఇన్ని రోజులుగా అర్జీలు ఇస్తూనే ఉన్నాం .. కానీ న్యాయం మాత్రం శూన్యం
- పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల ఆవేదన
- పరిష్కరిస్తామంటున్నారే కానీ.. ఎక్కడా అంటూ నిట్టూర్పు
- అర్జీలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి



జేసీ విద్యాధరికి సమస్యలు విన్నవించుకుంటున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్: ''ఒకటి కాదు రెండు కాదు వారాల తరబడి మీ కార్యాలయానికి అష్టకష్టాలు పడి వస్తున్నాం.. దూరాభారం లెక్క చేయకుండా ఎంతో ఆశతో వచ్చి మాగోడు విన్నవిస్తున్నాం.. సమస్య పరిష్కారం కోరుతూ అర్జీలు ఇస్తూనే ఉన్నాం.. కానీ న్యాయం మాత్రం జరగడం లేదు.. కాస్త దయ చూపండి సారూ'' అంటూ అర్జీదారులు నిట్టూర్చారు. తమ గుండెల్లో బాధను అధికారుల ఆవేదనతో వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

భూమి ఆక్రమణకు యత్నం



భూ ఆక్రమణను అడ్డుకోవాలని విన్నవిస్తున్న మాలూరు ఎస్టీ కాలనీవాసులు

కొందరు తమ గ్రామంలోని భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని శ్రీరంగరాజుకుప్పం మండలం మాలూరు ఎస్టీ కాలనీవాసులు రాజేంద్ర, రవి వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 70 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. తమ గ్రామానికి సమీపంలో సర్వే నంబర్ 365లో ఉన్న పశువులమేత భూమిలో చాలా ఏళ్లుగా పశువులను మేపుకుంటున్నట్లు చెప్పారు. ఆ భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా అలాగే ఉంచి తమ పశువులను మేపుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

సంవత్సరంగా పింఛన్ అందడం లేదు



పింఛన్ మంజూరు చేయించాలని కోరుతున్న దివ్యాంగుడు సుందరమూర్తి

తనకు సంవత్సరం నుంచి పింఛన్ అందడం లేదని చిత్తూరు రూరల్ మండలం సిద్ధంపల్లికి చెందిన దివ్యాంగుడు సుందరమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తనకు కిడ్నీలు చెడిపోవడంతో స్విమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నట్లు తెలిపారు. తనకు గతంలో రూ.10 వేలు పింఛన్ ఇచ్చేవారని చెప్పారు. తనకు ఏడాదిగా పింఛన్ అందడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయించాలని కోరారు.

విచారణ చేయించండి



విచారణ చేయించి న్యాయం చేయాలని కోరుతున్న బీఎంవీ పల్లి గ్రామస్తులు

మా గ్రామంలోని ఓ వ్యక్తి నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని అగ్రకులస్తులకు అమ్ముకుంటున్నాడని వెదురుకుప్పం మండలం బీఎంవీ పల్లికి చెందిన శారదమ్మ, మురళి వాపోయారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ గ్రామంలో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం 15ఏ 1975 ప్రకారం భూమిని ఇచ్చిందన్నారు. అయితే ఆ భూమిని ఓ వ్యక్తి అక్రమంగా అమ్ముకుంటున్నట్లు అధికారులకు వివరించారు. విచారణ చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

మా గ్రామానికి రోడ్డు వేయండి



రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్న అబ్బుగుండు ఎస్సీ కాలనీ వాసులు

మా ఊరికి రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు అర్జీ ఇచ్చినాం.. ఎలాంటి న్యాయం జరగలేదు. మాది ఐరాల మండలం ఎర్రేపల్లి పంచాయతీ అబ్బుగుండు ఎస్సీ కాలనీ. మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గ్రామం ఏర్పడి 150 ఏళ్లు అవుతున్నా ఇంత వరకు రోడ్డు లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ గ్రామంకు రోడ్డు వేయించాలి.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుకు వినతి చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని పాఠశాల వ్యవస్థ, ఉపాధ్యాయులకు సంబంధించి అనేక సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడును యూటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయుల అరియర్స్, బిల్లుల మంజూరులో ఆలస్యమవుతుందన్నారు. పీఎఫ్ ఖాతాలకు సంబంధించి జమకాకుండా ఉన్న మొత్తాలను వేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పీఎఫ్ రుణాల మంజూరులో సీలింగ్‌ను తొలగించాలని, ఆన్‌లైన్ స్లిప్‌లను పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బీమా కార్యాలయంలో పలు సమస్యలపై సూపరింటిండెంట్‌ను కలిసి వినతి చేశారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ సకాలంలో అందడం లేదని జిల్లా ఖజనా కార్యాలయంలో కోరారు. తదుపరి జిల్లా సమగ్ర శిక్ష పీడీ వెంకటరమణను కలిసి మోడల్ పాఠశాలలలో ఫర్నీచర్స్ ఏర్పాటు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన బియ్యాన్ని నేరుగా స్కూల్‌కు మంజూరు చేయాలని డీఈఓ కార్యాలయ ఏడీని కోరారు. ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్ సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. పదోన్నతి పొందిన టీచర్లు కొంతమందికి కేడర్ మారలేదని, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు నాయుడు, రమణ, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, నాయకులు మణిగండన్, రెహానా బేగం, రెడ్డప్ప నాయుడు, పార్థసారథి, సరిత, గణేష్ కుమార్, సుధాకర్‌నాయుడు, మునెయ్య, శ్రీదేవి, మధు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు..
అండగా ఉంటాం..



చేతన్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్.గాంధీబాబు కుమారుడు జి.చేతన్ థాయ్‌లాండ్‌లో ఈ నెల 17వ తేదీన గుండె పోటుతో హఠాత్తుగా మృతి చెందాడు. ఈ నేపథ్యంలో చేతన్ భౌతికాయం సోమవారం ఉదయం చిత్తూరుకు చేరుకుంది. అక్కడ నుంచి స్వగ్రామం ఎగువ తవణంపల్లెలో దహనక్రియలు పూర్తి చేశారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తలు విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని చేతన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం గాంధీబాబును, కుటుంబసభ్యులను పెద్దిరెడ్డి పరామర్శించారు. అధైర్య పడవద్దు.. మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ, పలు పార్టీ నాయకులు చేతన్ భౌతికాయానికి పూలదండలు వేసి నివాళులర్పించారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ఏదీ ?

- పాడ్యమి ఎఫెక్ట్
- మందగించిన వ్యాపార సముదాయాలు
- ప్రజలకు అవగాహన కల్పించని అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పన్నుల విధానంలో మార్పులు తీసుకొచ్చింది. జీఎస్టీ 2.0 సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా 12 శాతం స్లాబులో ఉన్న వస్తువులు 5 శాతం శ్రేణిలోకి, 28 శాతం ఉన్న వస్తువులు 90 శాతం వాటిని దాదాపు 18 శాతం పన్ను రేట్లకు మార్చినట్లు ప్రకటించారు. ఆరోగ్యానికి హానికర, ఇతర వస్తువులు 40 శాతంలోకి మార్చింది. దీంతో ఔషధాలు, పుస్తకాలు, ఎరువుల ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ పన్నుల శాతం, దసరా ముందస్తు ఆఫర్ కింద పలు వస్తువుల ధరలు తగ్గాయి. ఇది వినియోగదారులకు ఊరట కలిగించే విషయమే. పాడ్యమి కావడంతో సేల్స్ పెద్దగా జరగలేదు. దీనికితోడు మంగళవారం సైతం పెద్దగా వ్యాపారం ఉండదు. క్షేత్రస్థాయిలో అధికారులు కూడా ఎక్కడా జీఎస్టీ పన్నుల శాతం తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించలేదు. వ్యాపారులు ఎక్కువ ధరలకు అమ్మితే ఎలా ఫిర్యాదు చేయాలో ప్రచారం చేయలేదు. పండుగలకు ఎక్కువగా ద్విచక్ర, కార్ల కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.90 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ద్విచక్ర వాహనాలపై పది శాతం పన్ను తగ్గడంతో రూ.10 వేలకు పైగా ధరలు తగ్గనున్నాయి. దీనికితోడు కార్లపై రూ.లక్ష వరకు తగ్గవచ్చని కంపెనీలు ఇదివరకే ఆఫర్లు ప్రకటించాయి. తదుపరి ఎలక్ట్రానిక్స్ రంగానిదే పెద్దపీట ఏసీ, టీవీ, ఫ్రిడ్జ్, ఫోన్లు, వాషింగ్‌మెషీన్ వస్తువులపై పది శాతం వరకు ధరలు తగ్గుతుందని వ్యాపారులు అంటున్నారు.

బెయిల్ వచ్చిందని సంబరాలు..ఆపై..

చిత్తూరు అర్బన్: ఓ కేసులో బెయిల్ వచ్చినందుకు, రోడ్డుపై టపాకాయలు పేలుస్తూ.. సంబరాలు చేసుకున్నారంటూ సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. నగరంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన వ్యక్తిని ఓ గొడవ కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతనికి ఇటీవల బెయిల్ రావడంతో తన స్నేహితులతో కలిసి రోడ్డుపై కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చాడంటూ పలువురు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పెట్టారు. ఈ చర్యలతో చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలిగిందని పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారిస్తున్నామని, కచ్చితంగా చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతు, రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం పాక్షికంగా ఉంటుందని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు పనులు జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. బజారువీధి, సంతపేట, జెండామానువీధి, సీబీరోడ్డు, ఓటీకే రోడ్డు, చవటపల్లె, తిమ్మసముద్రం, గాంధీరోడ్డు, ఇందిరానగర్, ఎల్ఐసీకాలనీ, కైలాసపురం, హైరోడ్డు ప్రాంతాల వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

మహిళలకు వైద్య పరీక్షలు



పోషకాహార స్టాల్స్‌ను ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: ఆరోగ్యకరమైన మహిళలతోనే బలమైన కుటుంబాలు ఆవిర్భవిస్తాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప అన్నారు. సోమవారం మండలంలోని వేదగిరివారిపల్లెలో స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులతో పాటు పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం వేదగిరివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పదార్థాల స్టాళ్లను ఏర్పాటు చేసి వాటి గురించి వివరించారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: స్త్రీల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం మండలం కె.పట్నం, కృష్ణాపురం గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ స్త్రీల ఆరోగ్య శ్రేయస్సు కోసం శిబి రాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్త్రీలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా కృష్ణాపురంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. ముఖ్యంగా మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుని సంతోషమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ దూడీ

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా చిత్తూరుకు వచ్చిన డూడీ.. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో పోలీసుశాఖ చొరవ చూపాలని జడ్జి ఆదేశించారు.

కాణిపాకంలో మణికంఠ చందోలు



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న మణికంఠ చందోలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం ఐపీఎస్ (గతంలో చిత్తూరు ఎస్పీ)అధికారి మణికంఠ చందోలు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచనాలు, తీర్థప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ నరసింహులు, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం ఓ దాత నగదు విరాళం చేశారు. బెంగళూరుకు చెందిన అనిల్‌రెడ్డి రూ.ఒక లక్షను ట్రస్టుకు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాత కుటుంబానికి దర్శనం కల్పించారు.

ఎస్పీతో పోలీస్ అసోసియేషన్ భేటీ

చిత్తూరు అర్బన్ : నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ తుషార్ డూడిని సోమవారం జిల్లా పోలీసు అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించారు. పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని, సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.


రక్తదాన శిబిరం



గుడిపాల: రక్తదానం అందజేస్తున్న యువకులు

గుడిపాల: రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం బొమ్మసముద్రంలో రక్తదాన శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వస్థ్ నారీ – సశక్త పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో భాగంగా ప్రజలతో ఆమె మాట్లాడారు. మహిళలకు ప్రధానంగా బీపీ, డయాబెటిస్, నోటి క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ రోగాలకు సంబంధించిన టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు, కళాశాల సిబ్బంది రక్తదానం చేశారు.

బాలాత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు



బంగారుపాళెం: శ్రీబాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో వజ్రాలపురం గంగమ్మ



బంగారుపాళెం: చందనాలంకరణలో ముత్యాలమ్మ



దుర్గాంబను దర్శించుకున్న కలెక్టర్



సౌభాగ్యలక్ష్మి అలంకరణలో

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం ఆలయం ఆవరణలో గణపతి హోమం, కలశపూజ చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టి, వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీబాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో భాగంగా వజ్రాలపురం గంగమ్మ రోజుకో రూపంలో దర్శనమిస్తారని తెలిపారు. ఆలయ ధర్మకర్త కృష్ణప్ప, చాతుర్య పురుషోత్తం, దీప, గోపి, ఉషా, నరేష్ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చందనాలంకారంలో ముత్యాలమ్మ

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారుపాళెం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారు చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని ఓంశక్తి ఆలయం, ఓటీకే వీధిలోని సత్యమ్మ ఆలయం, మొగిలి వెంకటగిరిలోని గంగమ్మ ఆలయాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు.

చిత్తూరు రూరల్‌లో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. చిత్తూరు నగరంలోని పలు అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దుర్గాంబ దేవస్థానంలో సోమవారం ఉదయం చండీయాగం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి మహాలక్ష్మి అలంకరణ చేపట్టగా.. కలెక్టర్ సుమిత్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయన దర్శనం కల్పించి సన్మానించారు. అలాగే కన్యాకా పరమేశ్వరి దేవస్థానంలో కుంకుమార్చన చేశారు. ఉదయం కౌమరిదేవి, రాత్రి మహేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. బ్రహ్మకుమారీస్ చిత్తూరు సేవా కేంద్రంలో బాల త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు అభయమిచ్చారు.

ఐరాలలో..

ఐరాల: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా వైఎస్ గేటులో వెలసిన చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.